క్లుప్తంగా

డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ షఫ్రుల్లా



కర్నూలు(హాస్పిటల్): డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ షఫ్రుల్లా నియమితుల య్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ సిరి ఉత్తర్వులు జారీ చేశారు. దీతో ఆయన కర్నూలు డీసీహెచ్ఎస్ కార్యాలయంలో శని వారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ స్పెషాలిటీ విభాగాలు అభ్యసించిన ఆయన మూడేళ్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఈఎన్‌టీ విభాగంలో, ఇటీవల మూడేళ్లు నంద్యాల డీసీహెచ్‌స్‌గా విధులు నిర్వహించారు.

పచ్చదనాన్ని కాపాడుకోవాలి



మొక్కకు నీరు పోస్తున్న వర్సిటీ అధికారులు

కర్నూలు(సెంట్రల్): పుడమిపై పచ్చదనాన్ని కాపాడుకున్నప్పుడు మానవాళి మనుగడ సాధ్య మవుతుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య వి.వెంకటబసవరావు పేర్కొ న్నారు. శనివారం స్వచ్ఛంద్ర–స్వర్ణాంధ్రలో భాగంగా ఆర్‌యూలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సీవీ కృష్ణా రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరా జు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యానవనాల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించండి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో ఉద్యానవనాల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని నగరపాలక సంస్థ కమిష నర్ పి. విశ్వనాథ్ ఆదేశించారు. శనివారం ఎల్ఐసీ కాలనీ, మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ, వీనస్ కాలనీ, ప్రేమ్ నగర్ ప్రాంతాల పార్కులను కమిషనర్ పరిశీలించారు. ఈ సం దర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో పార్కులను అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పార్కులో పచ్చదనం పెంపొందించాలన్నారు. ఈ కార్య క్రమంలో హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, డీఈఈ గంగాధర్, ఏఈ మనోజ్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు బకాయిలు చెల్లించకపోతే దుకాణాలు సీజ్

కర్నూలు (టౌన్): ట్రేడ్ లైసెన్సుల బకాయిలు చెల్లించకపోతే దుకాణాలను వెంటనే సీజ్ చేస్తున్నట్లు నగరపాలక పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు హెచ్చరించారు. శనివారం ఆయన ఖడక్‌పురా, అంబేడ్కర్ సర్కిల్ ప్రాం తాల్లో ట్రేడ్ లైసెన్సుల మొండి బకాయిదారుల దుకాణాలను సీజ్ చేశారు. ఆయన మాట్లాడు తూ నగరపాలక సంస్థకు పన్నులే కీలకమ న్నారు. దుకాణాదారులు సకాలంలో పన్నులు చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాల న్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రత్యేక బృందాలతో బకాయిలు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, జిలానీ, మునిస్వామి, హుస్సేన్, లోకేష్ పాల్గొన్నారు.

9 నుంచి సీపీఐ మహాసభలు

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు 9,10,11 తేదీల్లో కర్నూలులో సీపీఐ 24వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గి డ్డయ్య తెలిపారు. ఈ సభలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శని వారం ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జనసేవాదళ్ క్యాంపు ప్రారంభోత్సవం సంద ర్భంగా అరుణతార పతకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే జన్ సేవాదళ్ క్యాంపును విజయవంతం గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.జగన్నాథం, నగర సహాయ కార్య దర్శులు మహేష్, శ్రీనివాసరావు, జి.చంద్రశే ఖర్, నాయకులు బీసన్న, నల్లన్న, ఈశ్వర్, భద్ర కుమార్, అన్వర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, బద్రి, శివ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్ని కల్లో రజకులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురు శేఖర్, జిల్లా అధ్యక్షుడు ముక్కన్న అన్నా రు. శనివారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడు తూ..రజకులపై దాడుల నివారణ కోసం వెంటనే అట్రాసిటీ తరహాలో ప్రత్యేక చట్టాన్ని తేస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం మోసం చేస్తోం దన్నారు. అంతేకాక రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న రజక పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి పట్టించుకోవడం లేదన్నారు. అదిగో ఇదిగో అంటూ ఏడాది గడిచినా ఒక్క హామీ నెర వేర్చకపోవడంతో ఆగస్టు 25న ధర్నాకు పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, జయమ్మ, రాముడు, ఈరన్న, సూరి పాల్గొన్నారు.

‘పట్టా’భిషేకానికి వేళాయె!

నేడు ట్రిపుల్ ఐటీడీఎం స్నాతకోత్సవం

- 206 మందికి గ్రాడ్యుయేషన్ పట్టాల అందజేత
- విద్యాబోధనలో, కొలువుల సాధనలో ప్రత్యేక గుర్తింపు సాధించిన కళాశాల
- ఏడేళ్లలో 75 నుంచి 331కి పెరిగిన సీట్లు
- పూర్తి స్థాయి సదుపాయాలతో సరికొత్తగా క్యాంపస్



జగన్నాథగట్టుపై ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీడీఎం

కర్నూలు సిటీ: నైపుణ్య శిక్షణ, సాంకేతికతతో కూడిన విద్య, పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీ డీఎం). నగర శివారు జగన్నాథగట్టుపై వెలసి స్వల్ప వ్యవధిలో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొం దిన ఈ కళాశాల నేడు (ఆదివారం) 7వ స్నాతకోత్స వానికి సిద్ధమైంది. ఇందుకు అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏపీ పునర్విభజన చట్టం -2014 ప్రకారం ఏర్పడిన ట్రిపుల్ ఐటీడీఎంకు పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తోంది. ఈ క్యాంపస్‌లో మొత్తం 11 భవనాలు, ఐదు సెమి నార్ హాల్స్, ఒకటి మల్టీపర్పస్ హాల్ నిర్మించారు. ఈ క్యాంపస్‌లో చదివిన విద్యార్థుల్లో పలువురు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. మొదటి బ్యాచ్ నుంచి ప్రస్తుతం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న బ్యాచ్ వరకు ఏటే టా ఉద్యోగాలు సాధించిన వారి సంఖ్య పెరుగుతోం ది. దీనికి తోడు పరిశోధన విద్యలోను అద్భుతాలు సాధించి, జాతీయ స్థాయిలో మన్ననలు పొందారు ఇక్కడి విద్యార్థులు. నిరుద్యోగులకు సైతం డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకా శాలకు ట్రిపుల్ ఐటీ మార్గం చూపుతుంది.

ఏటేటా పెరుగుతున్న ఉద్యోగాల కల్పన

ట్రిపుల్ ఐటీడీఎంలో 2015–19 మొదటి బ్యాచ్. ఈ బ్యాచ్‌కి చెందిన 36 మంది క్యాంపస్ రిక్రూట్‌మెం ట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోగా 26 మందికి ఆఫర్స్ రావ డంతో వారంతా ఉద్యోగాల్లో చేరారు. అలాగే 2016–20 బ్యాచ్‌లో 69 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 45 మందికి, 2017–21 బ్యాచ్‌లో 84 మంది రిజి స్ట్రేషన్ చేసుకోగా 61 మందికి, 2018–22 బ్యాచ్‌లో 103 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 118 మందికి, 2019–23 బ్యాచ్‌లో 81 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 72 మందికి, 2020–24 బ్యాచ్‌లో 100 మంది రిజి స్ట్రేషన్ చేసుకోగా 92 మందికి, 2021–25 బ్యాచ్‌లో 115 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 98 మందికి జాబ్ ఆఫర్స్ వచ్చాయి. వీరిలో చాలా మంది భారీ ప్యాకేజీ లతో జాబ్‌లకు ఎంపికయ్యారు.

206 మందికి పట్టాలు

కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎంలో 2015లో మొదటగా మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికే షన్, కంప్యూటర్ సైన్సు కోర్సులు ప్రారంభమయ్యా యి. 2019–20 అకడమిక్ ఇయర్ నుంచి అదనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్అండ్ డాటాసైన్స్ అనే మరో బీటెక్ కోర్సు, మూడు పీహెచ్‌డీ కోర్సులు మొదల య్యాయి. మొదట 75 సీట్లతో ఉన్న బీటెక్ నేడు(20 25–26) 331 సీట్లకు పెరిగాయి. గతేడాది 300 సీట్లు ఉండేవి, ఈ విద్యా సంవత్సరంలో సూపర్ న్యూమరీ సీట్లు అని 31 సీట్లు అదనంగా కేటాయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా సైబర్ సెక్యూరిటీస్ కోర్సును 20 సీట్లతో ప్రవేశ పెట్టారు. 7వ స్నాతకోత్స వంలో 2021–25 బ్యాచ్‌కు చెందిన 206 మంది బీటెక్ విద్యార్థులకు పట్టాలు అందించనున్నారు. క్యాంప స్‌లోని కృష్ణ సెమినార్ హాలులోజరిగే ఈ స్నాత కోత్స వానికి ముఖ్య అతిథిగా అంతరిక్ష శాఖ కార్యద ర్శి, అం తరిక్ష కమిషన్ చైర్మన్ డా.వి నారాయణన్, గౌరవ అతి థులుగా ట్రిపుల్ ఐటీడీఎం, కర్నూలు గౌరవ చైర్ పర్స న్ పద్మశ్రీ డాక్టర్ దేశ్‌మనే విజయలక్ష్మి, గౌరవనీయ డైరెక్టర్ ఆచార్య బీఎస్ మూర్తి హాజరుకానున్నారు.

వసతుల్లో మేటీ

దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు తగ్గ వాతా వరణం ఉండేలా ట్రిపుల్ ఐటీడీఎంను తీర్చిది ద్దారు. 151 ఎకరాల విస్తీర్ణంలోని క్యాంపస్‌లో 60 ఎకరాల్లో భవనాలు నిర్మించారు. క్రీడలకు సైతం ప్రత్యేకంగా ఇండోర్ స్టేడియం, యోగా, జిమ్ తదితర వాటికి అవసరమైన సదుపాయాలు కల్పిం చారు. మినీ క్రికెట్ స్టేడియం సైతం నిర్మించారు. విద్యార్థులకు పోస్టల్ సేవల కోసం ప్రత్యేకంగా పోస్టల్ కార్యాలయం, 24 గంటల వైఫై ద్వారా ఇం టర్‌నెట్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. సంగీతం, నృత్యాలలో శిక్షణ, డిజిటల్ లైబ్రరీ, 5 వేలకుపైగా పుస్తకాలు, వందలాది పరిశోధన పుస్తకాలు అందుబాటులో పెట్టారు. ఇలా అన్ని వసతులతో కర్నూలు ట్రిపుల్ ఐటీ దేశంలోని 25 ట్రిపుల్ ఐటీల్లో మేటీగా జాతీయ స్థాయిలో గుర్తిం పు పొందింది.



క్యాంపస్‌లో విద్యార్థుల హాస్టల్ భవనం

సుంకులమ్మకు ఎస్వీ దంపతుల ప్రత్యేక పూజలు



సుంకులమ్మను దర్శించుకుంటున్న ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు

కర్నూలు (అర్బన్): నగరంలోని 8వ వార్డు దండగే రిలో జరిగిన సుంకులమ్మ బోనాల జాతరకు వైఎ స్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దండగేరికి చెందిన లక్ష్మన్న ఆహ్వానం మేరకు వారు అక్కడికి వెళ్లి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అనుబంధ సంస్థ అధ్యక్షులు, నగర అనుబంధ సంస్థ అధ్య క్షులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

బంగారు వ్యాపారికి బురిడీ

కర్నూలు: నగరంలోని షరాఫ్ బజార్‌లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వ్యాపారికి బురిడీ కొట్టిం చారు. ఇద్దరు వ్యక్తులు షరాఫ్ బజార్‌లో హరి అనే వ్యాపారి దగ్గరికి వెళ్లి తమ దగ్గర ఉన్న బంగారం అమ్ముతామని ఒరిజినల్ చూపించారు. వ్యాపారి దానిని పరిశీలించి రూ.లక్ష విలువ చేస్తుందని డబ్బులు ఇచ్చాడు. ఆ తర్వాత నకిలీ బంగారాన్ని వ్యాపారి చేతిలో పెట్టి అక్కడి నుంచి ఉడాయిం చారు. కొద్దిసేపు తర్వాత బంగారాన్ని కరిగించేం దుకు వ్యాపారి పరిశీలించగా నకిలీదని తేలడంతో మోసపోయినట్లు గ్రహించి రెండో పట్టణ పోలీ సులకు ఫిర్యాదు చేశాడు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



చంద్రబాబు మోసాలను కల్లూరు అర్బన్‌లో మహిళకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాట సాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 37వ వార్డులో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ, ఇంటింటికీ వంచన కార్యక్రమం నిర్వ హించారు. కాటసానిని ప్రజలు వివిధ సమస్యలు తెలియజేశారు. రేషన్‌బండ్లు తీసేయడంతో షాపుల కు వెళ్లి బియ్యం తెచ్చుకునేందుకు చాలా ఇబ్బం దులు పడుతున్నామని వాపోయారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ ప్రజల తరపున వైఎస్సా ర్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింద ని, నేటికి రైతులు, పేదలకు ఎలాంటి మేలు చేయ లేదని చెప్పారు. దీనిని కప్పిపుచ్చుకునేందుకు ఇది మంచి ప్రభుత్వమంటూ ప్రచారం చేసుకుంటుం దని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలతో పాటు అదనంగా సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తా మని ఎన్నికల ముందు కూటమి నాయకులు చెప్పా రన్నారు. ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని మం డిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పోరాటాల ఫలితంగా ఇటీవల తల్లికి వందనం పథకం అమలు చేశారని, అది కూడా అందరికి ఇవ్వలేదని చెప్పారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఆచరణలో చేతులు ఎత్తేసిందన్నారు. ఉచిత బస్సు హామీ అమలు ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్వేతా రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, వార్డు నాయకులు షరీఫ్, భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంగులు, ఖాదర్ బాషా, చిన్న మాధవ స్వామి, శ్రీనివాసులు, దుర్గాప్రసాద్, గోరంట్ల మాధవస్వా మి, పార్టీ వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు పెడితే సహించేది లేదు

- అధికారపార్టీ నాయకులకు పోలీసులు వత్తాసు
- నగరపాలక డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): అధికారపార్టీ నాయకులకు తలొ గ్గి తప్పుడు కేసులు పెట్టి వైఎస్సార్ సీపీ నాయకు లను, కార్యకర్తలను ఇబ్బందులు పెడితే సహించేది లేదని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమ సింహా రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, పార్టీ మహిళా నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెండు రోజుల క్రితం 10 వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనూసుబాషా కార్యాలయంపై మద్యం మత్తులో టీడీపీ గుండాలు, రౌడీషీటర్ మహబూబ్ ఖాన్ దాడులు చేసి ధ్వంసం చేశారన్నారు. తమ చర్యలతో స్థానికులు భయాందోళనకు గురి చేయ డమే కాక తిరిగి పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టారన్నారు. బాధితుడు షేక్ యూనుసు బాషా ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో అదే రోజు రాత్రి 12 గంటలకు ఫిర్యాదు చేస్తే 1.30 గంటకు కేసు నమోదు చేశారన్నారు. దౌర్జన్యం చేసిన వారు ఆరోజు పోలీసు స్టేషన్‌కు వెళ్లకపోయినా బాధితుడి కంటే అరగంట ముందే ఫిర్యాదు చేసినట్లు తప్పుడు కేసు ఫైల్ చేశారన్నారు. పార్టీ జిల్లా అధ్య క్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి.. బాధిత కార్పొరేటర్‌ను పరామర్శిస్తే ఆయనపై రౌడీషీటర్ మహబూబ్ ఖాన్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గతంలో ఎస్వీ దగ్గర పనిచేసిన విషయాన్ని ఆయన మర్చిపో యినట్లు ఉన్నాడని మండిపడ్డారు.

అధికారపార్టీ నాయకులకు పోలీసుల వత్తాసు

కూటమి ప్రభుత్వ హయంలో పోలీసులు సక్రమం గా విధులు నిర్వహించడం లేదని, అధికారపార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పార్టీ మహిళా విభాగం నాయకురాలు గాజుల శ్వేతా రెడ్డి, అరుణ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ షేక్ అహమ్మద్ విమర్శించారు. తమ పార్టీ ఐదేళ్ల కాలంలో కర్నూలు నగరం ప్రశాంతంగా ఉండేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఏడాది కాలంగా గొడవలు, కేసులతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నార న్నారు. 8 నెలల్లో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్ని కలు జరుగనున్నాయని, ప్రజలు అప్పుడు వారికి ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం చేతకాక కూటమి నాయకులు ప్రతిపక్షపార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. తాము కేసులకు భయపడేది లేదని, న్యాయస్థానా లను ఆశ్రయిస్తామన్నారు. సమావేశంలో కార్పొరే టర్లు అర్షియా ఫర్హీన్, లక్ష్మీకాంత రెడ్డి, జుబేర్, క్రిష్ణ కాంత్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో క్లీన్ అండ్ గ్రీన్

కర్నూలు: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పోలీసులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ల పరిసరాలను శుభ్రం చేసుకున్నారు. పోలీస్ హెడ్ క్వాటర్‌తో పాటు సబ్ డివిజన్ కేంద్రాలు, సర్కిల్ స్టేషన్లు, సిబ్బంది పాల్గొన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సిబ్బందికి సూచించారు.

రేపటి నుంచి వీఏఏలకు అవగాహన

కర్నూలు(అగ్రికల్చర్):ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు రైతు సేవ కేంద్రాల ఇన్‌చార్జీలకు ప్రకృ తి వ్యవసాయంపై అవగాహన కల్పించనున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాధురి తెలిపారు. అన్ని వ్యవసాయ శాఖ డివిజన్ కేంద్రాల్లో నిర్వహించే ఈ సదస్సుల్లో ఎంపిక చేసిన వీఏఏలకు మాత్రమే మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. ఆయా మండలాల వ్యవసాయ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

గీతాంజలిలో ల్యాంప్ లైటింగ్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టే ట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాలలో శనివారం 2024–25 సంవత్సరం బ్యాచ్ బీఎస్సీ, పీబీ బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్ కార్యక్రమాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి అతిథిగా కళాశాల అధినేత పెరుగు విజయ్‌వర్ధన్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. 80 శాతం పైగా మార్కులు సాధించిన సీనియర్ నర్సింగ్ విద్యార్థులకు నగదు బహుమతిగా రూ.5 వేలు చొప్పున అందజేశారు. క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వసంతకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంటే డ్యూటీ రోస్టర్ వేస్తున్నారు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశా లలో నర్సుల డ్యూటీ రోస్టర్‌ను నర్సింగ్ సూపరింటెం డెంటే వేస్తున్నారని పలువురు నర్సులు చెప్పారు. ఆసు పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో వారు మాట్లాడారు. డ్యూటీ రోస్టర్ వేయడంలో ఎలాంటి అక్రమాలు జరగడం లేదన్నారు. దివ్యాంగు లైన నర్సులను, క్యాన్సర్ బాధితులను ఏ రోజూ కూడా కష్టమైన వార్డులకు వేయలేదని చెప్పారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయిపై కొంద రు ఓర్వలేక ఆరోపణలు, ఫిర్యాదులు చేయడం మాన సిక క్షోభకు గురిచేస్తోందన్నారు. సమావేశంలో హెడ్‌న ర్సులు పి.లీలారాణి, బి.శ్యామల, ఎం.వి.రమణమ్మ, వి. ఉమామహేశ్వరి, స్టాఫ్‌నర్సులు యు.ఎం.శాంతి లత, జి.శాంతమ్మ, ఎం.సత్యవతమ్మ, బి.సుశీల, మునిపటి లిల్లమ్మ, డి.మంజులాదేవి పాల్గొన్నారు.

మహిళా పీఎస్ డీఎస్పీగా ఉపేంద్ర బాబు



ఉపేంద్ర బాబు

కర్నూలు: కర్నూలు మహిళా పీఎస్ డీఎస్పీగా ఎం.ఉపేంద్ర బాబు నియమితులయ్యారు. ఇక్క డున్న శ్రీనివాసాచారిని గుంతకల్లు డీఎస్ఆర్‌పీకి బదిలీ చేసి ఎమ్మిగనూరులో పనిచేస్తున్న ఉపేంద్ర బాబును మహిళా పీఎస్‌కు నియమిస్తూ ఉత్త ర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు డీఎస్పీలకు స్థాన చలనం కల్పిస్తూ ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం రాత్రి ఉత్త ర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో ఇద్దరు డీఎస్పీలకు స్థాన చలనం కలిగింది. శ్రీనివాసాచారి గత ఏడాది ఆగస్టు 9వ తేదీన కర్నూలు మహిళా పీఎస్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఏడాది కూడా గడవకముందే ఆయనపై బదిలీ వేటు పడటం పోలీసు శాఖలో చర్చనీయాంశమైం ది. అలాగే ఉపేంద్ర బాబు కూడా గత ఏడాది సెప్టెంబర్ 19న ఎమ్మిగనూరు డీఎస్పీగా నియ మితులయ్యారు. ఆయనను కూడా అనతికాలంలోనే బదిలీ చేయడంపై సర్వత్రా చర్చ జరుగుతుంది. కాగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి డీఎస్పీగా నియమితులైన మర్రివాడ భార్గవిని ఎమ్మిగనూ రుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుదాం

- నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్



ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల ప్రదర్శనను ప్రారంభిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు (టౌన్) : నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరం గా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా కలిసి రావాలని నగ రపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ పిలుపు నిచ్చారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరపాలక కార్యాలయంలో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల ప్రదర్శన, ప్లాస్టిక్ వ్యర్థాలకు పునరుత్పాదక వస్తువుల అందజేత కేం ద్రాలను కమిషనర్ ప్రారంభించారు. కార్యక్రమం లో అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిష నర్ సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

- నగర పౌరుడిగా సమాజ శ్రేయస్సు, భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు సమయం కేటాయిం చాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ అన్నారు. శనివారం స్థానిక 21 వ వార్డులోని బాష్యం స్కూల్‌లో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశం పై అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలి

కర్నూలు(హాస్పిటల్): ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్ర మంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలోని న్యూ డయా గ్నోస్టిక్ బ్లాక్ వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు, ఇన్‌చార్జి ఏఆర్ఎంవో, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడవద్దని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. శనివారం కళాశాలలో ప్లాస్టిక్ వాడవద్దని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధీర్, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్వచ్ఛ దివస్‌లో భాగంగా కార్యాలయ పరిసరాలను పరి శుభ్రం చేయించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ పి. శాంతి కళ, డీఎల్ఏటీఓ డాక్టర్ ఎల్.భాస్కర్, కార్యాలయ పరిపాలన అధికారిణి అరుణ, డీఐవో డాక్టర్ నాగప్ర సాద్‌బాబు, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ మహేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని గుత్తిపెట్రోల్ బంక్ సమీపంలోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో మేనేజర్ అడ్డా కుల సుంకన్న ఆధ్వర్యంలో స్వచ్ఛతపై అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు ఎనావత్ కైక, ఇమిడిశెట్టి గాయత్రి, ఎ.చం ద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జ్యోతి, జీఎస్‌టి అధికారి రామకృష్ణ, సిబ్బంది చిక్కండు చం ద్రశేఖర్, సరస్వతి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

నేడు చెన్నకేశవ నాటక కళా భజన మండలి వార్షికోత్సవం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బుధవారపే టకు చెందిన చెన్నకేశవ నాటక కళా భజన మం డలి 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆది వారం ప్రత్యేక సాంస్కృతిక, వాయిద్య కార్యక్ర మాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు పోతురాజు చౌదరి నరసిం హులు, అధ్యక్ష, కార్యదర్శులు కందుల అరున్, బంగి వీరస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలి పారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు, రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు హాజరుకా నున్నట్లు చెప్పారు. కళాప్రియులు అధిక సం ఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

బంగారు గొలుసు దొంగ అరెస్టు



రైల్వే పోలీసులు అరెస్టు చేసిన గొలుసు దొంగ

కర్నూలు: బంగారు గొలుసును అపహరించిన దొంగను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వివరా ల్లోకి వెళితే.. తూర్పు గోదావరి జిల్లా మామిడికు దురు మండలం మొగలికుదురుకు చెందిన మృ త్యుంజయ రావు దంపతులు తెలంగాణ రాష్ట్రం లోని పుణ్యక్షేత్రాలు సందర్శించి శుక్రవారం కర్నూ లుకు వచ్చారు. మార్కాపురం మీదుగా శ్రీశైలం వెళ్లేందుకు కర్నూలు రైల్వేస్టేషన్‌లో ఔరంగబాదు–గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. మృత్యుంజ యరావు భార్య లక్ష్మీ ప్రసూన్నాంబ రైలులో వాష్ రూమ్‌కు వెళ్లి బయటకు వస్తుండగా ఉలిందకొండ గ్రామానికి చెందిన యల్ల కృష్ణుడు ఆమె కంట్లో కారం కొట్టి మెడలోని బం గారు గొలుసు లాక్కుని ఉడాయించాడు. బాధితు రాలు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి 24 గంటలు గడవకముందే నింది తుడిని గుర్తించి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 22 గ్రాముల బంగారు రికవరీ చేశారు. చోరీ కేసును ఛేదించినందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు సిబ్బం దిని అభినందించారు.

సామాన్యులకు అందుబాటులో బ్యాంకు సేవలు



అల్పాహారం తీసుకుంటున్న వృద్ధులు

కర్నూలు(అగ్రికల్చర్):బ్యాంకుల జాతీయకరణతో సామాన్యులకు, పల్లెలకు బ్యాంకు సేవలు అందు బాటులోకి వచ్చాయని ఏఐబీఈఏ జిల్లా ముఖ్య సలహాదారులు నాగరాజు, ప్రదాన కార్యదర్శి శివకృ ష్ణ అన్నారు. బ్యాంకుల జాతీయకరణ దినోత్స వాన్ని పురస్కరించుకొని శనివారం ఏఐబీఈఏ, ఏపీ టీబీఈఎఫ్ పిలుపు మేరకు ఆయా బ్యాంకు యూనియన్ల ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్ర మాలు జరిగాయి. ఇందులో భాగంగా షిర్డీసాయి ఓల్డేజ్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు అల్పాహార సదుపాయం కల్పించారు. ఏఐబీఈఏ జిల్లా ముఖ్య సలహాదారులు మాట్లాడు తూ...1969 జూలై 19న భారత ప్రభుత్వం 14 బ్యాంకులను జాతీయకరణ చేసిందని తెలిపారు. అయితే, నేడు బ్యాంకుల ప్రయివేటీకరణకు ప్రయత్నిస్తుండటం ఆందోళన కలిగించే విష యమని అన్నారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ నాయకులు ఎల్లయ్య, నాగరాజు, సుమన్, వాసు దేవరెడ్డి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఐరన్ ఓర్ లీజును రద్దు చేయాలి



మైనింగ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): వెల్దుర్తి మండలం పుల్లగు మ్మిలో సీతారామయ్య అనే వ్యక్తికి ఇచ్చిన ఐరన్ ఓర్ లీజును వెంటనే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శని వారం పుల్లగుమ్మి రైతులతో కలసి మైనింగ్ కార్యా లయం ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ ఐరన్ ఓర్‌తో సమీపంలోని పంట పొలాల్లో దుమ్ము, ధూళి పడి పంటలు పండడం లేదన్నారు. దీని వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లు తుండడంతో వెంటనే ఆ లీజును రద్దు చేయాలని కోరారు. అనంతరం ఈ అంశంపై మైనింగ్ అధికా రులకు వినతిపత్రం సమర్పించారు.